నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి





బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం, చల్లా, పెద్ది, గండ్ర తదితరులు

# ప్రశ్నించే గొంతుక బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

**ఆరు గ్యారెంటీలు అమలు కావాలంటే పోరాడే పార్టీకే పట్టంకట్టాలి**

**కాంగ్రెస్‌కు ఓటు వేయడం వృథా.. బీజేపీ మాట వింటే జోడీ, వినకపోతే ఈడీ**

**కడియం పోయినంక బీఆర్‌ఎస్‌లో జోష్ పెరిగింది**

**బీఆర్‌ఎస్‌తో వచ్చిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి**

**ద్రోహం చేసిన శ్రీహరికి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి**

**అలాంటి వాళ్లను మళ్లీ చేర్చుకునే ప్రసక్తే లేదు**

**వరంగల్ లోక్‌సభ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు**



*వరంగల్, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆరు గ్యారెంటీలు అమలు కావాలన్నా, కాంగ్రెస్ మెడలు వంచాలన్నా.. ప్రశ్నించే గొంతుక, పోరాడే బీఆర్ఎస్‌ను గెలిపించాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం హసన్‌పర్తిలో నిర్వహించిన వరంగల్ లోక్‌సభ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ఆ పార్టీకి ఓటు వేయడం వృథా అని చెప్పారు. కడియం శ్రీహరి పోయిన తర్వాత పార్టీలో జోష్ కనిపిస్తున్నదని, పదవులను, కూతురికి టికెట్ తీసుకుని బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన శ్రీహరికి గట్టిగా గుణపాఠం చెప్పాలన్నారు. కష్టకాలంలో పార్టీని వీడిన ద్రోహులను మళ్లీ చేర్చుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వరంగల్ అభివృద్ధికి బీఆర్ఎస్ ఎంతో కృషి చేసిందని, కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని చెప్పారు.*



సన్నాహక సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు

బీఆర్ఎస్ పనిఅయిపోయిందని అంటున్నారని.. తెలంగాణ ఉన్నంతవరకు బీఆర్ఎస్ ఉంటుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాల పొంగు అని మాట్లాడిన టీడీపీనే తెలంగాణలో లేకుండా పోయిందని గుర్తుచేశారు. కేసీఆర్ పొలంబాట కార్యక్రమానికి అద్భుత స్పందన వస్తున్నదని చెప్పారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. 'కడియం శ్రీహరి పోయిన తర్వాత పార్టీలో జోష్ కనిపిస్తున్నది. పదవులను, కూతురికి టికెట్‌ను తీసుకుని బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన శ్రీహరికి గట్టిగా గుణపాఠం చెప్పాలనే కసి కార్యకర్తల్లో కనిపిస్తున్నది. 'కడియం శ్రీహరికి బీఆర్ఎస్ ఏం తక్కువ చేసింది. ఉప ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చాం. అన్ని ఇచ్చిన బీఆర్ఎస్‌కు కడియం శ్రీహరి జీవితాంతం రుణపడి ఉన్నా తక్కువే. పార్టీ మారేదే లేదని చెప్పిన శ్రీహరి ఎందుకు మారాడో సమాధానం చెప్పాలి. అర్ధరాత్రి పూట దొంగలు లంకె బిందెలు వెతుకుతారు. ఆ అలవాటు రేవంత్‌రెడ్డికి ఉన్నట్టు ఉంది అని విమర్శించిన కడియం శ్రీహరి అదే రేవంత్‌రెడ్డితో కండువా కప్పించుకున్నడు. ఇంత దిగజారుడు రాజకీయాలు అవసరమా? కడియం శ్రీహరికి నైతిక విలువలు ఉంటే బీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. దొంగలతో కండువా కప్పించుకునే స్థాయికి శ్రీహరి దిగజారుడు అవసరమా? దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు పడిపోతున్నాయి. ఆ పార్టీలోకి శ్రీహరి పోయిండు. కార్యకర్తలు ధైర్యంగా ఉండండి. వరంగల్‌లో ఎంత అద్భుతమైన పోరాటం చేశాం. బీఆర్ఎస్‌కు కేసులు, పోరాటాలు కొత్త కాదు. ఒకరిద్దరు నాయకులను కొనొచ్చు. ఉద్యమకారులను, కార్యకర్తలు, ప్రజలను కొనలేరు. అక్రమ కేసులు పెట్టి బెదిరిస్తున్నారు. పరకాల ఉప ఎన్నికలో అటుకులు బుక్కి పనిచేశాం. పెద్ది సుదర్శన్‌రెడ్డి పొక్కులు వచ్చి రక్తం కారినా స్టేషన్ ఘనపూర్ ఉప ఎన్నికలో గులాబీ జెండా ఎగురవేశాం. తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు బీఆర్ఎస్ ఉంటుంది. కష్టసమయంలో పార్టీని వదిలి వెళ్లిన వారిని మళ్లీ తీసుకునేది లేదు. కష్టపడే కార్యకర్తలకు తప్పక గుర్తింపు ఉంటుంది. ద్రోహం చేసినవాళ్లను మళ్లీ చేర్చుకునే ప్రసక్తే లేదు. వరంగల్ తొలి నుంచి ఉద్యమాల గడ్డ. బీఆర్ఎస్‌కు అండగా ఉన్నది. ఇక్కడి కార్యకర్తల కాళ్లు కడిగి నెత్తిమీద చల్లుకున్నా తక్కువే. వరంగల్ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ఎంతో కృషిచేసింది. ఐదు మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషల్ హాస్పిటల్, టెక్స్‌టైల్ పార్కును తెచ్చాం. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని రేవంత్‌రెడ్డి అంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికార చిహ్నంలోని కాకతీయ తోరణాన్ని తీసేస్తామని రేవంత్ అంటున్నారు. అదే జరిగితే వరంగల్ అగ్నిగుండమవుతుంది. కాంగ్రెస్ నామరూపాల్లేకుండా పోతుంది. కాకతీయ తోరణం వరంగల్ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక' అని హరీశ్‌రావు అన్నారు. సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు బస్వరాజు సార య్య, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సిరికొండ మధు సూదనాచారి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జడ్పీ అధ్యక్షులు సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ చైర్మన్లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్ రాజుయాదవ్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, లింగంపల్లి కిషన్‌రావు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



### గెలుపు బాధ్యత మనదే

నా రాజకీయ అనుభవంతో చెబుతున్నా. ప్రతిపక్షం గట్టిగా ఉంటే ప్రభుత్వానికి వణుకు పుడుతుంది. ఇటీవల పరకాల నియోజకవర్గంలో అక్రమ కేసులు పెడితే మనం ఉద్యమిస్తే ఎస్సై సస్పెండ్ అయ్యాడు. పోయిన వాళ్లు పోనీయండి. మనం బలంగా ఉండాలి. కేసీఆర్ నిన్న దేవరుప్పులకు వస్తే అందరిలో ఉత్సాహం కనిపించింది. శ్రీహరి పార్టీ నుంచి పోయినంక వరంగల్ పార్లమెంట్ సీటు 25 మంది అడుగుతున్నారు. ఎవరికి సీటు ఇచ్చినా గెలిపించే బాధ్యత మాది. కడియం శ్రీహరికి టీడీపీలో నేనే ఎమ్మెల్యే టికెట్ ఇప్పించిన. బీఆర్ఎస్‌లో ఎన్నో అవకాశాలు వచ్చాయి. ఇప్పుడు శ్రీహరిని ఓడగొట్టే బాధ్యత నాదే.

*– మాజీ మంత్రి దయాకర్‌రావు*



### కడియం బీఆర్ఎస్‌పై కుట్రలు చేశాడు

2001లో సిద్దిపేటలో గులాబీ జెండా ఎగిరినప్పుడు స్టేషన్ ఘన్‌పూర్‌లోనూ ప్రజలు గెలిపించారు. రాజయ్య సీటు కడియం శ్రీహరికి ఇస్తే మనం ఓట్లు వేసి గెలిపించాం. కడియం పార్టీ మారేందుకు మూడు నెలల క్రితమే కుట్ర మొదలైంది. కడియం కావ్యకు అవకాశం కోసం అరూరి రమేశ్, పసునూరి దయాకర్, రాజయ్యను వెళ్లగొట్టాడు. ఇటీవలి ఎన్నికల్లోనూ నాకు, దయాకర్‌రావుకు, వినయ్‌భాస్కర్‌కు వ్యతిరేకంగా పనిచేశాడు. మేము మాత్రం ఆయన గెలుపు కోసం పని చేశాం. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి నేనున్నా. కార్యకర్తలకు అండగా ఉంటా. కడియం శ్రీహరి ఓ బ్రాండ్ అని ఆయన బిడ్డ అంటున్నది. ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్‌కు వెన్నుపోటు పొడవడమే బ్రాండా? శ్రీహరి ఇప్పుడు వస్తే స్టేషన్‌ఘన్‌పూర్ ప్రజలు చెప్పుతో కొడతామని అంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కడియంకు డిపాజిట్ రాకుండా ఓడగొడతాం.

*– జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి*

### శ్రీహరిది నీచమైన చరిత్ర



ఏ మాత్రం నీతి, నిజాయితీ ఉన్నా కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. శ్రీహరిది నీచమైన చరిత్ర. కుట్ర పన్ని ఎంతో మందిని అణచివేశాడు. వరంగల్ జిల్లాలో ఎన్నో బూటకపు ఎన్‌కౌంటర్లు జరిగినా స్పందించలేదు. మంత్రి పదవి ఉంటే చాలు అనుకున్నాడు. ఎన్టీఆర్ బలహీన పడగానే చంద్రబాబు పక్షాన నిలిచాడు. ఎన్టీఆర్ నుంచి కేసీఆర్ వరకు కడియం వెన్నుపోటు పొడిచాడు. సామాజిక ఉద్యమాలకు వెన్నుపోటు పొడిచాడు. మమ్మల్ని కూడా ఎదగకుండా చేశాడు. బీఆర్ఎస్‌లో దళితులు, బీసీలను ఇబ్బంది పెట్టాడు. కేఏ పాల్ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోనూ చేరతాడు. అలాంటి వ్యక్తికి ప్రజాక్షేత్రంలో బుద్ధి చెప్పాలి.

*– బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్*

### ప్రతి కార్యకర్త కసితో పనిచేయాలి



కడియం పార్టీలోకి రాకముందు నుంచే స్టేషన్ ఘన్‌పూర్‌లో బీఆర్ఎస్ గెలిచింది. నాగుపాముకు, శ్రీహరికి తేడా లేదు. మా అవకాశాలు పణంగా పెడితే నీకు అవకాశాలు వచ్చాయి. ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులోకి వెళ్లడమేనా శ్రీహరి అనుభవం. కడియం శ్రీహరికి బీఆర్ఎస్ పార్టీ ఉప ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులు ఇచ్చింది. నా జీవితంలో కడియం అంత మోసకారిని చూడలేదు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వరంగల్ ఎంపీగా ఎవరికి అవకాశం ఇచ్చినా కడియం రాజకీయ సన్యాసం తీసుకునేలా పనిచేస్తాం. ఆనాడు ఉద్యమంలో భాగంగా కాళ్లకు బొబ్బలు వచ్చి రక్తం వచ్చినా పాదయాత్ర చేసి ఓడించాం. ఇప్పుడు అంతే కసిగా పనిచేద్దాం. కడియంను చిత్తుగా ఓడించేందుకు సిద్ధం కావాలి. నక్కజిత్తుల నాయకులకు ఓరుగల్లు పౌరుషం చూపించాలి.

*– మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి*





ములుగు ప్రభుత్వ దవాఖానలోని టీ డయాగ్నస్టిక్ సెంటర్

# కలెక్టర్ సీసీ.. పైరవీల 'దోస్తీ'

**వైద్య ఆరోగ్య శాఖలో మిత్రుడికి పోస్టింగ్**

**డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి కొలువు**

**రెగ్యులర్ కాంట్రాక్టు పోస్టుకు ఎంపిక చేయాలని ఒత్తిడి**

ములుగు, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ) : ములుగు కలెక్టర్ క్యాంప్ క్లర్క్ (సీసీ) క్రాంతి తీరు ములుగు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. ఉద్యోగ నియామకాల్లో అతడు చేస్తున్న పైరవీల తీరు చర్చకు తెరలేపింది. పంచాయతీ కార్యదర్శి నుంచి సీసీగా వచ్చిన సదరు వ్యక్తి అందిన కాడికి దండుకుంటూ అక్రమాలకు తెరలేపుతున్నాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు అతని పరిధి దాటి పనులు చేయొద్దనే నిబంధనలున్నప్పటికీ అవేవీ పట్టించుకోకుండా కొంత మంది అధికారులను తన కంట్రోల్‌లో పెట్టుకొని ఆడిందే ఆట, పాడిందే పాటగా ప్రవర్తిస్తున్నాడు. ప్రస్తుత కలెక్టర్ ఇలా త్రిపాఠి గతంలో అదనపు కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో గోవిందరావుపేట మండలం రాఘవపట్నం జీపీలో కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న క్రాంతిని సీసీగా తీసుకున్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం క్రాంతి ఆమె సీసీగా కొనసాగుతున్నాడు. 2023 ఆగస్టు నెలలో డీఎంఎఫ్‌టీ ఫండ్ ద్వారా ల్యాబ్ టెక్నీషియన్‌గా తన మిత్రుడు మధూకర్‌ను ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఏటూరునాగారం ప్రభుత్వ దవాఖానలో ఉద్యోగం ఇప్పించాడు. ఉద్యోగంలో చేరిన అనంతరం కలెక్టర్ సీసీ అండదండలతో ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నాడనే కారణంతో ములుగు జిల్లా దవాఖానకు కేటాయించారు. ప్రభుత్వ దవాఖాన టీహబ్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నాడు.

**రెగ్యులర్ కాంట్రాక్టు పోస్టు కోసం ఒత్తిడి**

ఇటీవల రెగ్యులర్ కాంట్రాక్టు పోస్టుకు మధూకర్‌ను ఎంపిక చేయాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ జగదీశ్వర్‌పై సీసీ క్రాంతి ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలిసింది. రెగ్యులర్ కాంట్రాక్టు పద్ధతిలో కొన్నేళ్లుగా ఏటూరునాగారం ప్రభుత్వ దవాఖానలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ భాస్కర్ బాధ్యతాయుతంగా పని చేయడం లేదని ప్రస్తుత అడిషనల్ కలెక్టర్ శ్రీజ విచారణ జరిపి టర్మినేట్ చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న క్రాంతి భాస్కర్ స్థానంలో తన మిత్రుడు మధూకర్‌కు ఉద్యోగాన్ని ఇప్పించేందుకు ప్రజావాణిలో అర్జీ పెట్టించి, దానిని కలెక్టర్‌తో ఎండార్స్ చేయించి డీసీహెచ్ఎస్‌ను కలిసి పైరవీ చేశాడు. ఈ క్రమంలో డీసీహెచ్ఎస్ రెగ్యులర్ కాంట్రాక్టు ఉద్యోగం భర్తీ కోసం నిబంధనల మేరకు నోటిఫికేషన్ విడుదల చేసి ఉన్నతాధికారుల సూచనలతో మెరిట్ ప్రకారం ఉద్యోగ నియామకాన్ని చేపట్టాల్సి ఉంటుందని క్రాంతికి తెలిపాడు. అంతటితో ఆగకుండా మధూకర్ చేత మంత్రి సీతక్క సిఫారసు లెటర్ తీసుకువచ్చి పోస్టింగ్ ఇవ్వాలని డీసీహెచ్ఎస్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై క్రాంతిని వివరణ కోరగా పేదవాడైన మధూకర్‌కు ఉద్యోగం ఇప్పించాలనే ఉద్దేశంతో తాను డీసీహెచ్ఎస్‌ను కోరినట్లు తెలిపాడు. ఇదే విషయమై డీసీహెచ్ఎస్ జగదీశ్వర్‌ను వివరణ కోరగా ఏటూరునాగారంలో ఖాళీ అయిన రెగ్యులర్ కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును మధూకర్‌కు ఇప్పించాలని సీసీ క్రాంతి తనను కలిసినట్లు చెప్పారు. మంత్రి సీతక్కతో పాటు కలెక్టర్ సిఫారసు లెటర్ తీసుకువచ్చినప్పటికీ నిబంధనల మేరకు ఉద్యోగం ఇవ్వాల్సి ఉంటుందని సీసీకి తెలిపినట్లు పేర్కొన్నారు.

# తుపాకీతో టీచర్ హల్‌చల్

**అల్లుడిపై గురి పెట్టిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు**

**ములుగులోని పెట్రోల్ బంక్ వద్ద ఘటన**

**భయాందోళనకు గురైన స్థానికులు**

**లైటర్ గన్‌గా తేల్చిన పోలీసులు**

ములుగు, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : కూతురిని కాపురానికి తీసుకెళ్లడం లేదనే మనోవేదనకు గురైన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు అల్లుడిపై తుపాకీ గురి పెట్టి బెదిరించిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ములుగు మండలంలోని దేవగిరిపట్నం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పోరిక మోహన్‌లాల్ తన కూతురును అల్లుడు శరత్ కాపురానికి తీసుకెళ్లకుండా ఇబ్బందులు పెడుతున్నాడని కోపం పెంచుకున్నాడు. సోమవారం మధ్యాహ్నం శరత్ ములుగులోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద ఉన్నాడన్న విషయం తెలుసుకొని హుటాహుటిన అతని వద్దకు చేరుకొని బైక్‌పై కూర్చొని ఉన్న శరత్‌పై తుపాకీని గురి పెట్టాడు. దీంతో భయాందోళన చెందిన శరత్ అతన్ని తోసివేయడంతో తుపాకీ కొంత దూరంలో పడింది. పెట్రోల్ బంక్ సిబ్బందితో పాటు వినియోగదారురులు బెంబేలెత్తిపోయారు. అల్లుడు శరత్, మామ మోహన్‌లాల్‌ల మధ్య తోపులాట జరుగుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

**లైటర్ గన్‌గా తేల్చిన పోలీసులు**

విషయం తెలవడంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు తుపాకీతో పాటు మోహన్‌లాల్, శరత్‌ను అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఈ విషయమై ఎస్సై వెంకటేశ్వర్‌ను వివరణ కోరగా మోహన్‌లాల్, అతని అల్లుడిపై గురి పెట్టిన తుపాకీని లైటర్ గన్ (గ్యాస్ లైటర్ లాంటిది)గా తేల్చారు. అయితే, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన అల్లుడిని బెదిరించింది లైటర్ గన్‌తోనే అయినా.. పెట్రోల్ బంక్‌లో అది మిస్ ఫైర్ జరిగితే పెద్ద ప్రమాదం జరిగి భారీ నష్టం వాటిల్లేదని స్థానికులు అంటున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.





పెట్రోల్ బంక్ వద్ద తలపడుతున్న మోహన్‌లాల్, శరత్, (ఇన్‌సెట్‌లో) పోలీసులు స్వాధీనం చేసుకున్న లైటర్ గన్

## అంబర్ ప్యాకెట్ ఇవ్వలేదని..

**కిరాణా వ్యాపారిపై కత్తితో దాడి.. పరిస్థితి విషమం**



నిందితుడు దేవేందర్

గణపురం, ఏప్రిల్ 1: అంబర్ ప్యాకెట్ ఇవ్వలేదని కిరాణా వ్యాపారిపై కత్తితో దాడి చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మచ్చ సాంబమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బంగ్లాపల్లి గ్రామంలో నగావత్ రాజు కిరాణా షాపు నడుపుతున్నాడు. అదే గ్రామానికి చెందిన గుగులోత్ దేవేందర్ ఆదివారం అర్ధరాత్రి సమయంలో వారిని లేపి అంబర్ ప్యాకెట్ ఇవ్వాలని అడిగాడు. రాజు లేదని చెప్పడంతో కోపంతో తన వెంట తెచ్చుకున్న కత్తితో దాడికి పాల్పడ్డాడు. దీంతో తేరుకున్న కుటుంబ సభ్యులు అరవగా దేవేందర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ దాడిలో రాజు మెడకు తీవ్ర గాయం కావడంతో వెంటనే 108 వాహనంలో వరంగల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తలించారు. కాగా రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బాధితుడి తల్లి ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసి దేవేందర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



ఎండ తీవ్రతతో మధ్యాహ్న సమయంలో నిర్మానుష్యంగా మారిన భూపాలపల్లిలోని జాతీయ రహదారి



ఎండ నుంచి ఉపశమనం కోసం శీతల పానీయాలు తాగుతున్న ప్రజలు

# సుర్రుమంటూంది..

**గరిష్ఠంగా 42 డిగ్రీలు నమోదు.. ఎండవేడికి తాళలేక జనం ఇక్కట్లు**



ఎండ వేడిమి తట్టుకోలేక గొడుగు కింద పండ్లు అమ్ముతున్న చిరు వ్యాపారి

భానుడు భగ్గుమంటున్నాడు. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రత పెరుగుతుండడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం 42 డిగ్రీలు నమోదుకాగా, మున్ముందు మరింత పెరిగే అవకాశముంది. కోల్‌బెల్ట్ ఏరియాలోని భూపాలపల్లిలో ఉదయం 8గంటలకే ఎండ ప్రభావం చూపిస్తుండడంతో ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. తప్పని పరిస్థితుల్లో జిల్లాకేంద్రానికి వచ్చిన ప్రజలు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం జ్యూస్ పాయింట్లు, కూల్ డ్రింక్స్ దుకాణాల వైపు పరుగులు తీస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలోనే ఇంత తీవ్రమైన ఎండలుంటే.. మేలో ఏవిధంగా ఉంటాయోనని జనాలు ఆందోళన చెందుతున్నారు. *– భూపాలపల్లి ఫొటోగ్రాఫర్, ఏప్రిల్ 1*



ఎండకు అలసిపోయి మధ్యాహ్న సమయంలో కునుకుతీస్తున్న సోడాబండి వ్యాపారి